సాక్షి విశాఖపట్నం

బుధవారం। 6। సెప్టెంబర్। 2023



విదేశీ సిగరెట్ల పట్టివేత

దుక్కవానిపాలెం టోల్‌గేట్ వద్ద అక్రమంగా తరలిస్తున్న విదేశీ సిగరెట్ల కంటెయినర్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. 12లో



కొనసాగుతున్న పరీక్షలు

ఎస్ఐ ఉద్యోగాలకు కైలాసగిరి ఏఆర్ పోలీస్ మైదానంలో దేహ దారుఢ్య పరీక్షలు మంగళవారం ప్రశాంతగా జరిగాయి. 12లో

శ్రీకృష్ణాష్టమి వేడుకలు నేడు



శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను హరే కృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ హాల్‌లో బుధ, గురువారాలు నిర్వహించనున్నారు. 8లో

సర్వేపల్లి విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి బొత్స, ఎంపీ సత్యవతి, ఏయూ వీసీ ప్రసాదరెడ్డి



గురు వందనం





మాట్లాడుతున్న విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, వేదికపై మంత్రులు బూడి, గుడివాడ, ఎంపీ డా.సత్యవతి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి తదితరులు, హాజరైన ఉపాధ్యాయులు

- ఘనంగా రాష్ట్ర స్థాయి గురుపూజోత్సవం
- 196 మంది ఉపాధ్యాయులు, అధ్యాపకులకు అవార్డుల ప్రదానం
- హాజరైన మంత్రులు బొత్స, బూడి, గుడివాడ, రాష్ట్ర విద్యాశాఖ అధికారులు

ఏయూక్యాంపస్ : గురువులకే గురువుగా.. ఉపాధ్యాయ వృత్తికే వన్నెతెచ్చిన సర్వేపల్లి రాధాకృష్ణన్ నడయాడిన ఆంధ్ర విశ్వవిద్యాలయం వేదికగా రాష్ట్ర స్థాయి ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా జరిగింది. రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో కట్టమంచి రామలింగారెడ్డి స్నాతకోత్సవ మందిరంలో మంగళవారం జరిగిన ఈ వేడుకలకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, రాష్ట్ర పరిశ్రమల శాఖ గుడివాడ అమర్‌నాథ్‌తో కలిసి సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగాన్ని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి, ప్రధాని మోదీ ప్రసంగాన్ని పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రసంగాన్ని సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు చదివి వినిపించారు. రాష్ట్ర విద్యారంగంలో జరుగుతున్న సంస్కరణలు, తద్వారా వస్తున్న సత్ఫలితాలను ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు సాధించిన పలువురు వివరించారు. పాఠశాల, కళాశాల, విశ్వవిద్యాలయ, సాంకేతిక విద్య, నైపుణ్య శిక్షణ విద్య విభాగాల్లో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపిన 196 మంది అధ్యాపకులకు రాష్ట్ర మంత్రుల చేతుల మీదుగా పురస్కారాలు ప్రదానం చేశారు.

ఏర్పాట్లు భేష్

అవార్డు గ్రహీతలకు వేదిక కుడి వైపున కూర్చోవడానికి ఏర్పాట్లు చేశారు. మరో వైపున వారి కుటుంబ సభ్యులు, అతిథులు కూర్చున్నారు. హాజరైన ప్రతీ ఒక్కరికీ మంచి నీరు, అల్పాహారాన్ని వారి వద్దకే తీసుకువెళ్లి పంపిణీ చేశారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రణాళికాబద్ధంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. సువిశాలమైన ప్రాంగణంలో, పార్కింగ్ సదుపాయాలు ఉన్న ఏయూలో కార్యక్రమం నిర్వహించడంతో ఎటువంటి ఇబ్బందులు ఎదురవలేదు.

ఏయూ కర్మభూమి

ఆంధ్ర విశ్వవిద్యాలయం స్నాతకోత్సవ మందిరం వేదికగా ఈ కార్యక్రమం నిర్వహించడంపై పలువురు సంతోషం వ్యక్తం చేశారు. పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్ కుమార్ ఇదే విషయాన్ని గుర్తుచేస్తూ ఏయూతో సర్వేపల్లికి ఉన్న అనుబంధాన్ని వివరించారు. పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ మాట్లాడుతూ సర్వేపల్లి ఏయూలో పనిచేసిన తర్వాత ఉపరాష్ట్రపతిగా, రాష్ట్రపతిగా ఒక నూతన మార్గంలో ప్రగతి సాధించిన విధానాన్ని వివరించారు. ఏయూ కర్మభూమిగా నిలుస్తుందన్నారు. ఏయూ వేదికగా అవార్డు తీసుకుంటున్న ఉపాధ్యాయుల జీవితాలు కొత్త మలుపు తిరుగుతాయని, మరింత ఉన్నత ప్రగతి సాధ్యపడుతుందని ప్రశంసించారు.

కార్యక్రమంలో అనకాపల్లి ఎంపీ బి.సత్యవతి, జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, వేపాడ చిరంజీవరావు, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి, ఉన్నత విద్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జె.శ్యామల రావు, స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ ఎస్.సురేష్ కుమార్, ఇంటర్ విద్యా కమిషనర్ సౌరభ్ గౌర్, స్కూల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కమిషనర్ కె.భాస్కర్, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ నాగరాణి, ఉపాధి శిక్షణ కమిషనర్ బి.నవ్య, కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున, డీఈవో ఎల్.చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

అభినందించిన ప్రవీణ్ ప్రకాష్



రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ అభినందించారు. అవార్డు గ్రహీతల గ్యాలరీకి వెళ్లి వారిని పేరుపేరునా పలకరిస్తూ, శుభాకాంక్షలు తెలిపారు.

విద్యారంగంపై ఎనలేని శ్రద్ధ



41 ఏళ్లుగా ఉపాధ్యాయుడిగా సేవలందిస్తున్నా. రాష్ట్ర ప్రభుత్వం నా సేవలను గుర్తించినందుకు చాలా సంతోషంగా ఉంది. విద్యారంగంపై గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ప్రస్తుత ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. పేద విద్యార్థులకు ఒక వరంలా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దింది. ప్రభుత్వ పాఠశాలలు చాలా బాగున్నాయనే భావన పిల్లల తల్లిదండ్రుల్లో ఉంది. ఇది మాకు ఎంతో ఉత్సాహం, ప్రోత్సాహానిస్తోంది.

– పి.మురళీమోహన్‌రావు, హెచ్‌ఎం, జెడ్పీహెచ్‌ఎస్, చిట్టివలస

విద్యార్థులకు మంచి అవకాశం



రాష్ట్ర ప్రభుత్వం నాడు–నేడులో భాగంగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడం.. పేద విద్యార్థులకు అద్భుత అవకాశంగా మారింది. పాఠశాలల్లో మౌలిక వసతులు పెరగడం వల్ల విద్యార్థుల హాజరు శాతం పెరిగింది. విద్యారంగంలో తీసుకొచ్చిన సాంకేతిక మార్పుల వల్ల సులభంగా బోధించే అవకాశం లభించింది. నాకు అవార్డు రావడం చాలా సంతోషంగా ఉంది. ఈ అవార్డు నా బాధ్యతను మరింత పెంచింది.

– డి.ఫణికుమార్, స్కూల్ అసిస్టెంట్, జెడ్పీహెచ్‌ఎస్, తోటగరువు

చాలా ప్రోత్సాహంగా ఉంది



రాష్ట్రస్థాయి అవార్డు రావడం నాకు చాలా సంతోషంగా ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న సంస్కరణల వల్ల మంచి సత్ఫలితాలు వస్తున్నాయి. చదువుపై విద్యార్థుల్లో ఆసక్తి పెరిగింది. ఉత్సాహంగా విద్యను నేర్చుకుంటున్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను పాఠశాలలకు క్రమం తప్పకుండా పంపిస్తున్నారు.

– ఆర్.అప్పలరాజు, ఎస్జీటీ, జీవీఎంసీ 1వ వార్డు, భీమిలి

మరింత బాధ్యత పెరిగింది



రాష్ట్రస్థాయి అవార్డుతో మరింత బాధ్యత పెరిగింది. ప్రభుత్వం అందించిన మౌలిక వసతులతో విద్యార్థులకు సులభంగా బోధించగలుగుతున్నాం. దేశంలో మరే రాష్ట్రంలో లేనివిధంగా.. మన రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించింది. పేద విద్యార్థుల భవిష్యత్‌కు బంగారుబాటలు వేసింది.

– ఎస్.లావణ్య, పీఎస్, కేజీబీవీ, పద్మనాభం

నా కృషికి సరైన గుర్తింపు



విద్యార్థుల అభివృద్ధికి నేను చేసిన కృషికి ఇన్నాళ్లకు గుర్తింపు వచ్చింది. ప్రభుత్వం నా సేవలను గుర్తించింది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్య అభ్యసనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంచి వాతావరణం కల్పించారు. అమ్మ ఒడి, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన లాంటి పథకాలు విద్యాభివృద్ధికి బాటలు వేస్తున్నాయి. అక్షరాస్యతలో మన రాష్ట్రం భవిష్యత్‌లో మొదటి స్థానంలో నిలవడం ఖాయం.

– వి.సునీల్ కుమార్, అధ్యాపకుడు

విద్యారంగంలో ఎన్నో సంస్కరణలు



జాతీయ విద్యా విధానం 2020ను అమలు చేసిన మొదటి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ రికార్డు సృష్టించింది. విద్యా విధానం అనుగుణంగా పాఠ్యాంశాలు, నైపుణ్యాభివృద్ధి కోర్సులు ప్రవేశ పెట్టడం అభినందనీయం. విద్యా రంగంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చారు. రాష్ట్రస్థాయి అవార్డు అందుకోవడం చాలా సంతోషంగా ఉంది.

– ప్రొఫెసర్ కె.కిశోర్‌బాబు, డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్, ఏయూ

కొత్త పోలీస్ బాస్ రవిశంకర్

- ప్రస్తుత సీపీ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ ఎస్‌పీఎఫ్ ఐజీగా బదిలీ
- నూతన డీసీపీ(లా అండ్ ఆర్డర్)గా కంచి శ్రీనివాస్
- గ్రేహౌండ్స్ ఎస్పీగా ప్రస్తుత డీసీపీ వి.విద్యాసాగర్‌నాయుడు



సీపీ రవిశంకర్ అయ్యనార్



డీసీపీ శ్రీనివాస్

దొండపర్తి : విశాఖ నూతన పోలీస్ కమిషనర్‌గా డాక్టర్ రవిశంకర్ అయ్యనార్ నియమితులయ్యారు. ప్రస్తుతం ఈయన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడిషినల్ డైరెక్టర్ జనరల్‌గా పనిచేస్తున్నారు. ఇప్పటి వరకు సీపీగా విధులు నిర్వర్తించిన డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఐజీగా బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే డీసీపీ(లా అండ్ ఆర్డర్)గా ఉన్న వి.విద్యాసాగర్‌నాయుడును గ్రేహౌండ్స్ ఎస్పీగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో ప్రస్తుతం అనంతపురం ఎస్పీగా ఉన్న కంచి శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈయన గతంలో విశాఖ డీసీపీగా విధులు నిర్వర్తించారు.

సమర్థవంతమైన అధికారిగా రవిశంకర్

- 1994 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన రవిశంకర్ అయ్యనార్ పనిచేసిన ప్రతి చోటా సమర్థవంతమైన అధికారిగా పేరు సంపాదించారు. ప్రతిష్టాత్మక అవార్డులు అందుకున్నారు.
- 1968 అక్టోబర్ 20న ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం కాన్పూర్‌లో జన్మించిన రవిశంకర్ పుదుచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీలో ఎంబీబీఎస్ పూర్తి చేశారు. అలాగే ఉస్మానియా యూనివర్సిటీలో పోలీస్ మేనేజ్‌మెంట్‌లో మాస్టర్స్ డిగ్రీ, సింబయాసిస్ యూనివర్సిటీలో హాస్పిటల్ అండ్ హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్‌లో పీజీ డిప్లమో చేశారు. కొన్నాళ్లు జిప్‌మర్‌లో క్యాజువాలిటీ ఎమర్జెన్సీ మెడికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తించారు.
- 1994లో ఐపీఎస్‌గా ఎంపికైన తరువాత 1996 గ్రేహౌండ్స్ అసాల్ట్ కమాండర్‌గా నియమితులయ్యారు.
- 1997–98లో బెల్లంపల్లి సబ్ డివిజన్ ఏఎస్పీగా సింగరేణి బెల్ట్‌లో గెరిల్లా ఆపరేషన్స్‌కు నాయకత్వం వహించి మావోయిస్టుల నుంచి భారీగా ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.
- 1998–99లో వరంగల్ ఓఎస్‌డీగా మావోయిస్టు చర్యల నిరోధానికి చట్టపరమైన, సంస్థాగత ప్రణాళికలు రూపొందించారు. ఉత్తర తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దు జిల్లాల మీదుగా మావోయిస్టుల రాకపోకలు, తప్పించుకొనే మార్గాలు, ఆశ్రయ స్థలాలు, శిక్షణా శిబిరాలను సెస్నా ఎయిర్‌క్రాఫ్, జీపీఎస్ ద్వారా మ్యాప్ చేశారు.
- 1999–2002 వరకు నిజామాబాద్ ఎస్పీగా పాకిస్తాన్‌కు చెందిన రెసిడెంట్ ఏజెంట్ ఆషిక్ అలీపై జీహాదీ కేసు దర్యాప్తును పర్యవేక్షించారు. అలాగే ఇండియన్ మహ్మద్ ముస్లిమిన్ ముజాహిదీన్ మాడ్యూల్‌ను ఛేదిండంలో ఈయన కీలక పాత్ర పోషించారు.
- 2002లో హైదరాబాద్ నార్త్‌జోన్ డీసీపీగాను, 2002–2004 మధ్య గుంటూరు ఎస్పీగాను పనిచేశారు. అదే సమయంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబుపై జరిగిన ఐఈడీ బ్లాస్ట్ కేసును దర్యాప్తు చేశారు.
- 2004–2005లో కొసావోలో యునైటెడ్ నేషన్స్ మిషన్ సీరియస్ క్రైమ్స్ ఇన్వెస్టిగేషన్ యూనిట్ ఇన్వెస్టిగేటర్‌గా విధులు నిర్వర్తించారు. ఈ సమయంలో కొసావో పోలీస్ ఆఫీసర్ హత్యకేసు, అక్రమ ఆయుధాల కేసు, కొసావో అధ్యక్షుడు హరదినాజ్‌పై హత్యాయత్నం కేసుతో పాటు మరో రాజకీయ నాయకుడిపై హత్యాయత్నం కేసుల దర్యాప్తు చేపట్టారు.
- 2005–2006లో హైదరాబాద్ లా అండ్ ఆర్డర్ ఏఐజీగాను, 2006–2008 మధ్య స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్, 2008–2009లో ఏసీబీ అడిషినల్ డైరెక్టర్‌గాను, 2009–2010లో కరీంనగర్/వరంగల్ రేంజ్ డీఐజీగా విధులు నిర్వర్తించారు.
- 2010–2015 మధ్య నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ డీఐజీగా ఇండియన్ ముజాహుద్దీన్(ఐఎం) భారీ పేలుళ్ల కేసు, దిల్‌సుఖ్‌నగర్, మక్కా మస్జిద్, మాలేగాన్, బెంగుళూరు చర్చి, అజ్మీర్ దర్గా పేలుళ్ల కేసులను దర్యాప్తు చేసి ఛార్జిషీట్ దాఖలు చేశారు. అలాగే నకిలీ కరెన్సీ కేసులు, టెర్రర్ ఫైనాన్స్ కేసుల్లో జాతీయ, అంతర్జాతీయ లింకులు, మావోయిస్ట్ ల్యాండ్‌మైన్ బ్లాస్ట్ కేసులు, ఇటాలియన్ మెరైన్ కేసు ఇలా అనేక కీలక కేసులను దర్యాప్తు చేశారు.
- 2015–2018 మధ్య డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ జనరల్‌గా, 2015–2018లో ఆరోగ్యశ్రీ సీఈఓగా, 2018–2019లో ప్రొవిజన్స్ అండ్ లాజిస్టిక్స్‌లో ఐజీగా, 2019లో లా అండ్ ఆర్డర్ అడిషినల్ డైరెక్టర్ జనరల్‌గా విధులు నిర్వర్తించారు.
- ప్రస్తుతం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడిషినల్ డైరెక్టర్ జనరల్‌గా ఉన్న రవిశంకర్ విశాఖ సీపీగా నియమితులయ్యారు.

కొత్త డీసీపీ స్వస్థలం ఉమ్మడి విశాఖే..

విశాఖ డీసీపీ(లా అండ్ ఆర్డర్)గా రానున్న కంచి శ్రీనివాసరావు విశాఖతో అనుబంధం ఉంది. ఆయన స్వస్థలం అనకాపల్లి జిల్లా నర్సీపట్నం. 2009 గ్రూప్–1 ద్వారా డీఎస్పీ పోస్టు సాధించారు. తొలుత వనపర్తి, కొవ్వూరులో డీఎస్పీగా విధులు నిర్వర్తించారు. ఆ తరువాత సీఐడీ డీఎస్పీగా పనిచేశారు. అడిషనల్ ఎస్పీగా ఉద్యోగోన్నతి పొందాక విశాఖపట్నం డీసీపీగా, శ్రీకాకుళం అడిషనల్ ఎస్పీగా విధులు నిర్వర్తించారు. మరోసారి ఉద్యోగోన్నతి పొంది విజయవాడ ట్రాఫిక్ డీసీపీగా బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం అనంతపురం జిల్లా ఎస్పీగా ఉన్నారు. అక్కడి నుంచి విశాఖ డీసీపీగా నియమితులయ్యారు.

న్యూస్‌రీల్

సిరులతల్లికి లక్ష కుంకుమార్చన



దాబాగార్డెన్స్: కనక మహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం అమ్మవారికి లక్ష కుంకుమార్చన ఘనంగా జరిగింది. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు జరిగిన కుంకుమార్చనలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పూజా సామగ్రిని దేవస్థానమే సమకూర్చింది. ప్రతి నెలా మొదటి మంగళవారం నిర్వహించే ఈ పూజా రుసుం రూ.10 వేలు. ఈ మొత్తం చెల్లించిన భక్తుల తరపున నలుగురు దంపతులను అనుమతిస్తున్నట్లు ఆలయ ఈవో కె.శిరీష తెలిపారు. ట్రస్ట్ బోర్డు చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు.

ఏయూలో జాబ్‌మేళా రేపు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్, గైడెన్స్ బ్యూరో ఆధ్వర్యంలో ఈ నెల 7న ఉదయం 10.30 గంటలకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ చీఫ్ కె.దొరబాబు తెలిపారు. డబ్ల్యుఎన్ఎస్ సంస్థలో నాన్ వాయిస్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలకు డిగ్రీ విద్యార్హత కలిగిన వారు అర్హులు. 20 ఖాళీలను భర్తీ చేస్తారు. 20 నుంచి 35 ఏళ్లు ఉండాలి. నెలకు రూ.16 వేల వేతనం అందిస్తారు. బజాజ్ క్యాపిటల్ సంస్థలో సేల్స్, టెలీ, మార్కెటింగ్ ఉద్యోగాలకు ఇంటర్, డిప్లమో, డిగ్రీ, పీజీ చేసిన వారు అర్హులు. మొత్తం 12 ఖాళీలు భర్తీ చేస్తారు. 20 నుంచి 35 ఏళ్లు ఉండాలి. వీరికి వేతనంగా రూ.10వేల నుంచి 13 వేలు అందిస్తారు. అర్హత కలిగిన వారు www.ncs.gov.in/లో వివరాలు నమోదు చేసుకుని, ఇంటర్వ్యూకు హాజరు కావాలని దొరబాబు కోరారు. ఇతర సమాచారం కోసం 96660 92491లో సంప్రదించవచ్చు.

సింహాచలం దేవస్థానం ఈవోగా శ్రీనివాసమూర్తి



శ్రీనివాసమూర్తి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి దేవస్థానం ఈవోగా రెవెన్యూ శాఖకి చెందిన ఎస్.శ్రీనివాసమూర్తి నియమితులయ్యారు. ప్రస్తుతం విశాఖ డీఆర్వోగా విధులు నిర్వర్తిసున్న ఆయన్ని సింహాచలం దేవస్థానానికి ఈవోగా నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్‌రెడ్డి మంగళవారం జీవో 1777 జారీ చేశారు. 2021 జూలై ఒకటి నుంచి ఇప్పటి వరకు విశాఖ డీఆర్వోగా శ్రీనివాసమూర్తి విధులు నిర్వర్తిస్తున్నారు. త్వరలోనే దేవస్థానం ఈవోగా బాధ్యతలు స్వీకరిస్తానని.. అందరి సహకారంతో దేవస్థానం అభివృద్ధికి కృషి చేస్తానని ఈ సందర్భంగా 'సాక్షి'కి తెలిపారు. భగవంతుడికి, భక్తుడికి సేవ చేసేందుకు తనకు దక్కిన అవకాశంగా భావిస్తున్నట్లు చెప్పారు. కాగా.. గత ఏడాది ఆగస్టు రెండవ తేదీ నుంచి ఇప్పటి వరకు సింహాచలం దేవస్థానానికి శాశ్వత ఈవో లేరు. 2021 మార్చి నుంచి 2022 ఆగస్టు ఒకటవ తేదీ వరకు రెవెన్యూ శాఖకే చెందిన ఎం.వి.సూర్యకళ దేవస్థానం పర్మినెంట్ ఈవోగా విధులు నిర్వర్తించారు. ఆమె తర్వాత 2022 ఆగస్టు 2 నుంచి దేవదాయశాఖకి చెందిన ఆర్‌జేసీ డి.భ్రమరాంబ ఇన్‌చార్జి ఈవోగా పనిచేశారు. అదే ఏడాది సెప్టెంబర్ 21 నుంచి ఇప్పటి వరకు దేవదాయశాఖ ఆర్‌జేసీ వి.త్రినాథరావు ఇన్‌చార్జి ఈవోగా విధులు నిర్వర్తిసున్నారు. దేవస్థానానికి పర్మినెంట్ ఈవో లేకపోవడంతో పాలన వ్యవహారాల్లో నిర్లక్ష్యం నెలకొందని విమర్శలు వచ్చాయి. ఎట్టకేలకు పర్మినెంట్ ఈవోను నియమించడంతో ఆలయ పాలన ఓ కొలిక్కిరానుంది.

డిప్యూటీ కలెక్టర్లకు పోస్టింగ్‌లు



కొత్త డీఆర్వో మోహన్‌కుమార్

మహారాణిపేట: జిల్లాలో పలువురు డిప్యూటీ కలెక్టర్లను బదిలీ, పోస్టింగ్‌లు ఇస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్టీఆర్ జిల్లా రెవెన్యూ అధికారిగా పని చేస్తున్న కె.మోహన్‌కుమార్‌ను విశాఖ డీఆర్వోగా నియమించారు. ఇక్కడ డీఆర్వోగా పనిచేస్తున్న ఎస్.శ్రీనివాసమూర్తిని సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి ఈవోగా నియమించారు. అనకాపల్లి జిల్లా ఇన్‌చార్జి డీఆర్వో, ఆంధ్రప్రదేశ్ మౌలిక సదుపాయాల సంస్థ(ఏపీఐఐసీ) ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ ఎస్.డి.అనితను విజయనగరం రెవెన్యూ అధికారిగా బదిలీ చేశారు. చిత్తూరు ఫారెస్ట్ సెటిల్‌మెంట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న టి.చంద్రశేఖర్ నాయుడును విశాఖపట్నం పోర్టు ట్రస్ట్ ఎస్టేట్ మేనేజర్‌గా నియమించారు.

బెస్ట్ అకడమీషియన్ అవార్డుల ప్రదానం



ఆచార్యులకు అవార్డులు అందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఏటా గురుపూజోత్సవం పురస్కరించుకుని బోధన, పరిశోధనల్లో విశిష్ట కృషిచేస్తున్న ఆచార్యులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ అవార్డులను అందజేస్తుంటారు. ఈ ఏడాదికి గాను బెస్ట్ అకడమీషియన్ అవార్డులను ఏయూ ఫార్మసీ కళాశాలకు చెందిన వి.గిరిజాశాస్త్రి, ఏయూ ఇంజినీరింగ్ కళాశాల ఈసీఈ విభాగాధిపతి ఆచార్య పి.రాజేష్‌కుమార్, మ్యాథ్‌మెటిక్స్ విభాగాధిపతి ఆచార్య జి.నానాజీరావులకు వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి అందజేశారు. రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, అకడమిక్ డీన్ ఆచార్య ఎస్. కిశోర్ బాబు, ప్రిన్సిపాళ్లు ఆచార్య కె.శ్రీనివాసరావు, జి.శశిభూషణరావు, వై.రాజేంద్ర ప్రసాద్, టి.శోభశ్రీ, పవార్ పాల్గొన్నారు.

జోన్–2లో ఇద్దరు అధికారుల సరెండర్

దాబాగార్డెన్స్: జీవీఎంసీ జోన్–2లో రెవెన్యూ విభాగం అసిస్టెంట్ కమిషనర్ రమేష్, ఆర్ఐ రమేష్‌పై అవినీతి ఆరోపణలు వచ్చాయి. ఈ మేరకు వారిని జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి అధికారులు సరెండర్ చేశారు.

103 మందికి కారుణ్య నియామకాలు

రిక్రూట్‌మెంట్ ద్వారా 43 మంది నియామకం



నియామక పత్రాలను అందజేస్తున్న కలెక్టర్ మల్లికార్జున, జేసీ విశ్వనాథన్

మహారాణిపేట: ప్రభుత్వ ఉద్యోగులు నిజాయతీ, నిస్వార్థంగా సేవలందించాలని కలెక్టర్ ఎ.మల్లికార్జున సూచించారు. పలు ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తూ మరణించిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు మంగళవారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో కారుణ్య నియామక పత్రాలు అందించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో సాధారణ కారుణ్య నియామకాల కింద 70 మందికి, రెవెన్యూ శాఖలో 9 మందికి, గ్రామ సచివాలయాల్లో ముగ్గురికి, ఆర్టీసీలో 21 మందికి, రెవెన్యూ శాఖలో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్(గ్రూప్–4) ద్వారా ఎంపికైన 43 మంది జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ అసిస్టెంట్లకు నియామక పత్రాలు అందజేసినట్లు కలెక్టర్ తెలిపారు. వీరందరికీ కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపి.. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలని సూచించారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 436 మందికి నియామక పత్రాలు అందజేసినట్లు వెల్లడించారు. జాయింట్ కలెక్టర్ కె.ఎస్. విశ్వనాథన్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగం పొందిన వారు ప్రజలకు సేవ చేయాలని.. సమయపాలన పాటించాలన్నారు. డీఆర్వో ఎస్.శ్రీనివాసమూర్తి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, కలెక్టరేట్ కార్యాలయ పరిపాలన అధికారి కె.ఈశ్వరరావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

బ్యూటీఫుల్ స్మైల్ ఆఫ్ ఇండియాగా విశాఖ యువతి



మహారాణిపేట: నగరానికి చెందిన జ్యోతి కొత్తపల్లి బ్యూటీఫుల్ స్మైల్ ఆఫ్ ఇండియా అవార్డు, బెస్ట్ టాలెంట్ ఆఫ్ ఇండియా అవార్డు–2023లను కైవసం చేసుకుంది. ఇటీవల ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో నెట్ వర్క్ రెయిన్ బో మీడియా సంస్థ ఈ అవార్డులను ప్రదానం చేసింది. మురళీనగర్‌లోని పీఆర్ గార్డెన్స్ అంజనాద్రి అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న జ్యోతి కంప్యూటర్ అప్లికేషన్స్‌లో మాస్టర్స్ డిగ్రీ చేశారు. ప్రస్తుతం ఆమె యూఎస్ ఆధారిత కంపెనీలో పనిచేస్తున్నారు.

8న స్థాయీ సంఘ సమావేశం

22 అంశాలపై చర్చ



దాబాగార్డెన్స్: మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) స్థాయీ సంఘం సమావేశం చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన ఈ నెల 8వ తేదీన జరగనుంది. ఆ రోజు ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే సమావేశంలో 22 అంశాలను చర్చించనున్నారు. జోన్–2 పరిధి 8వ వార్డు తారకరామనగర్‌లో రూ.49.98 లక్షల వ్యయంతో బీటీ రోడ్డు నిర్మాణం, జోన్–7లో 80 నుంచి 84వ వార్డు వరకు పారిశుద్ధ్య నిర్వహణకు నియమించిన అదనపు సిబ్బందిని మరో 3 నెలలు కొనసాగించడం, జోన్–3 పరిధి 20వ వార్డు మానసిక ఆస్పత్రి జంక్షన్ నుంచి లెండివనం, ఆస్పత్రి డౌన్‌రోడ్డు వరకు రూ.49.65 లక్షల విలువతో ప్రహరీ నిర్మాణం, జోన్–7 పరిధి 84వ వార్డు సాలపువానిపాలెం విలీన గ్రామం వద్ద రూ.27.70 లక్షలతో ఆర్‌సీసీ డ్రెయిన్, ఎస్‌డబ్ల్యు డ్రెయిన్, ఆర్‌సీసీ కల్వర్టు నిర్మాణం, జోన్–7 పరిధి 83వ వార్డు సీతారాం కల్యాణ మండపం వేల్పుల వీధి వద్ద మేజర్ డ్రెయిన్‌పై ఆర్‌సీసీ కల్వర్టు కూల్చివేసి, రూ.41 లక్షలతో పున:నిర్మాణంపై సభ్యులు చర్చించనున్నారు. 2022–23, 2023–24 ఏడాదికి ప్రజారోగ్య విభాగంలో పనిచేస్తున్న శాశ్వత పారిశుద్ధ్య కార్మికుల కోసం రూ.39,88,139 అంచనాతో ఈ–ప్రొక్యూర్‌మెంట్ టెండర్ విధానం ద్వారా కొబ్బరి నూనె కొనుగోలు, జోన్–4 పరిధి 32వ వార్డులో అభివృద్ధి పనుల్లో భాగంగా నాలుగు పనులు రద్దు చేస్తూ, ఆ స్థానంలో భీమ్‌నగర్ వద్ద జీ+1 తరహాలో కల్యాణ మండపం నిర్మాణం, జోన్–3 పరిధి 14 నుంచి 27వ వార్డు వరకు, బీచ్‌రోడ్డులో పారిశుద్ధ్య నిర్వహణకు అదనపు సిబ్బంది నియామకం, జోన్–2 పరిధి 8వ వార్డులో సిల్వర్ వోక్స్ స్కూల్ నుంచి ఒమ్మివానిపాలెం వంతెన వరకు తారు రోడ్డు పునరుద్ధరణ, జోన్–6 పరిధి 76వ వార్డులో భరత్‌నగర్ వద్ద మేజర్ డ్రెయిన్ నిర్మాణం, జోన్–3 పరిధిలో జీవీఎంసీ దుకాణాలు, కల్యాణ మండపాలు మూడేళ్ల పాటు లీజు, తదితర అంశాలు సభ్యుల ఆమోదానికి చర్చకు రానున్నాయి.

అప్పన్నకు హీరో విజయ్ దేవరకొండ పూజలు



కప్పస్తంభం వద్ద విజయ్‌దేవరకొండ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామిని మంగళవారం హీరో విజయ్ దేవరకొండ దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి ప్రసాదం, శేషవస్త్రం, జ్ఞాపికను సూపరింటెండెంట్ సునీల్ ఆయనకు అందించారు.

ప్రజలంతా ఖుషీగా ఉండాలి

ఇటీవల విడుదలైన ఖుషి సినిమా విజయవంతం కావడం చాలా ఆనందంగా ఉందని విజయ్ దేవరకొండ అన్నారు. వరాహ లక్ష్మీనృసింహస్వామిని తొలిసారిగా దర్శించుకున్నానని, ఖుషి విజయం పట్ల ఆ స్వామికి కూడా కృతజ్ఞతలు తెలియజేశానన్నారు. ప్రజలంతా ఖుషీగా ఉండాలని ఆ స్వామిని వేడుకున్నట్లు చెప్పారు.

ఉత్తమ గురువులకు పురస్కారాలు

గురుపూజోత్సవం సందర్భంగా ఉత్తమ గురువులను రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా సన్మానించింది. ఏయూలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చేతులమీదుగా ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఆచార్యులు అవార్డులు స్వీకరించారు. - ఏయూక్యాంపస్



రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా అవార్డులు అందుకుంటున్న ఏయూ అకడమిక్ డీన్ ఆచార్య కిశోర్ బాబు, జీవీఎంసీ ఒకటో వార్డు బంగ్లామెట్ట పాఠశాల ఉపాధ్యాయుడు ఆర్. అప్పలరాజు, తోటగరువు హైస్కూల్ ఉపాధ్యాయుడు డి.ఫణికుమార్, చిట్టివలస హైస్కూల్ హెచ్ఎం పి.మురళీ మోహన్ రావు, అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.సుశీల్ కుమార్, ఏయూ ఆచార్యులు డి.లలిత భాస్కరి, కె.రమాసుధ, కె.సీతామాణిక్యం, సి.వి.నాయుడు, పి.శ్యామల(ఎడమ నుంచి)



సర్వేపల్లి రాధాకృష్ణన్ వేషధారణలో ఉపాధ్యాయుడు







దండాలు సారు.. మాస్టారు..

ఆకట్టుకున్న విద్యార్థుల నృత్య ప్రదర్శనలు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వ విద్యాలయంలో జరిగిన రాష్ట్రస్థాయి గురుపూజోత్సవంలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు కట్టిపడేశాయి. ముందుగా గణనాయక స్వాగత నృత్యంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. చంద్రంపాలెం పాఠశాల చిన్నారులు మా తెలుగు తల్లికి.. అంటూ చేసిన నృత్యం అలరించింది. గోపాలపట్నం జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు స్వాగత నృత్యం, గాజువాక జెడ్పీహెచ్ఎస్ విద్యార్థుల గురుబ్రహ్మ, గురువిష్ణు, గురుదేవో మహేశ్వర.. నడుపూరు జెడ్పీహెచ్ఎస్ విద్యార్థుల దండమో దండాలు సారు.. మాస్టారు.. అంటూ చేసిన శాస్త్రీయ, జానపద నృత్యాలు వారి ప్రతిభకు నిదర్శనంగా నిలిచాయి. ఏయూ నృత్య, సంగీత విభాగం విద్యార్థులు చేసిన కాళీయమర్దనం రూపకం, వందనం, మా వందనం, గురు వందనం అంటూ చేసిన గురుపూజ రూపకం ఎంతగానో ఆకట్టుకుంది. ఉన్నత విద్యాశాఖ కమిషనర్ పోలా భాస్కర్ రచించిన గేయం ఈ సందర్భంగా వేదికపై వినిపించారు. విద్యా రంగంలో చేపడుతున్న నూతన మార్పులు, ప్రగతిపై ప్రత్యేకంగా తీర్చిదిద్దిన వీడియో.. గత నాలుగేళ్లుగా జరుగుతున్న అభివృద్ధిని కళ్లకు కట్టినట్లు చూపింది.







డాక్టర్ రమారెడ్డి సేవలు నిరుపమానం

మహారాణిపేట: విధుల్లో అంకితభావంతో పని చేసి.. డాక్టర్ రమారెడ్డి అందరి మన్ననలు పొందారని డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు అన్నారు. రేసవానిపాలెంలో డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి సింహాచలం గ్రామీణ ఆరోగ్య కేంద్రానికి బదిలీపై వెళుతున్న డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ రమారెడ్డి సన్మాన సభ మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్ హెల్త్ మిషన్, ఇతర కార్యక్రమాలను ఎంతో విజయవంతంగా నడిపించారని కొనియాడారు. ఫ్యామిలీ డాక్టర్ విధానంలో నోడల్ అధికారిగా డాక్టర్ రమారెడ్డి మంచి సేవలు అందించారన్నారు. ఇందుకుగానూ కలెక్టర్ నుంచి ఆమె రెండు సార్లు ఉత్తమ అధికారిగా ప్రశంసాపత్రాలు పొందారని గుర్తు చేశారు. అనంతరం డాక్టర్ రమారెడ్డి దంపతులను సన్మానించారు. పలువురు వైద్యులు, అధికారులు పాల్గొన్నారు.



డాక్టర్ రమా రెడ్డి దంపతులను సన్మానిస్తున్న డీఎంహెచ్‌వో

పెన్షనర్ల పే రివిజన్‌కు కృషి

సీతంపేట: ఆల్ ఇండియా బీఎస్ఎన్ఎల్ పెన్షనర్ల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక పౌర గ్రంథాలయంలో మంగళవారం ఉమ్మడి విశాఖ జిల్లా ఆత్మీయ సమావేశం జరిగింది. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కుప్పిలి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఏడో వేతన సంఘం సిఫార్సులకు అనుగుణంగా బీఎస్ఎన్ఎల్ పెన్షనర్లకు పే రివిజన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం సుమారు 4 లక్షల మంది బీఎస్ఎన్ఎల్ పెన్షనర్లు 2017 నుంచి ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా రాజ్యసభ ఎంపీ జీవీఎల్ నరసింహారావుకు వినతి పత్రం అందజేయగా.. పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. పెన్షన్ రివిజన్‌పై ఇదివరకే కేంద్ర కమ్యూనికేషన్ మంత్రికి లేఖ రాశానని గుర్తు చేశారు. మరోసారి కేంద్ర మంత్రితో సమావేశమై పే రివిజన్ అమలుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎం.ఆర్.పట్నాయక్, సీనియర్ సభ్యులు వి.ఆర్.కె.శర్మ, ఆర్.ఎస్.ఎన్.మూర్తి, అధిక సంఖ్యలో పెన్షనర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజ్యసభ ఎంపీ జీవీఎల్ నరసింహారావు

లారీ ఢీకొని యువకుడి దుర్మరణం

ఆనందపురం : మండలంలోని శొంఠ్యాం పంచాయతీ గుమ్మిడివానిపాలెం వద్ద 16వ జాతీయ రహదారి సర్వీసు రోడ్డులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. శొంఠ్యాం పంచాయతీ మిందివానిపాలెం గ్రామానికి చెందిన జోగ సురేష్(25) స్విగ్గీ కంపెనీలో పనిచేస్తున్నాడు. కాగా సురేష్ ద్విచక్ర వాహనంపై పెందుర్తి బయలుదేరి నీళ్ల కుండీలు జంక్షన్‌కు సర్వీసు రోడ్డులో వస్తున్నాడు. వెనుకనే వస్తున్న లారీ సురేష్ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ సంఘటనలో సురేష్ ద్విచక్ర వాహనంతో సహ రోడ్డు పక్కకు పడిపోయి స్పృహ కోల్పోయాడు. ఈ సంఘటనను చూసిన స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించి మధురవాడలోని ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడ నుంచి తగరపువలసలోని ప్రైవేట్ అస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటనలో ద్విచక్ర వాహనం పూర్తిగా దెబ్బతినగా లారీ డ్రైవర్ ఆపకుండానే పరారయ్యాడు. అవివాహితుడు అయిన సురేష్ తండ్రి ముసలి నాయుడు కొన్నేళ్ల కిందట ఆత్మహత్య చేసుకోగా తల్లి భవాని, సోదరి ధనలక్ష్మితో కలిసి జీవిస్తున్నాడు. నిరుపేద కుటుంబం కావడంతో స్విగ్గీలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇంటికి పెద్ద దిక్కుగా ఉన్న కుమారుడు తీరని లోకాలకు వెళ్లిపోవడంతో తల్లి భవాని రోదించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసుని ఆనందపురం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



సంఘటన స్థలంలో సురేష్

బైక్ పడి మంత్రి రాజశేఖర్‌కు గాయాలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి, వైఎస్సార్ సీపీ నాయకుడు మంత్రి రాజశేఖర్‌కు రోడ్డు ప్రమాదంలో గాయాలయ్యాయి. ద్విచక్ర వాహనంపై సోమవారం ఇంటి నుంచి బయలుదేరిన ఆయన.. ముందు ట్రాఫిక్‌ను చూసి అకస్మాత్తుగా బ్రేక్ వేశారు. ఆ సమయంలో వెనకనే వస్తున్న మరో వాహనం ఆయన బైక్‌ను ఢీకొట్టింది. దీంతో ఆయన బైక్ నుంచి కింద పడి పోయారు. వాహనం ఆయన కాలిపై పడటంతో తీవ్ర గాయమైంది. వెంటనే ఆయన్ని ఆరిలోవ అపోలో ఆస్పత్రిలో చేర్పించారు. కాలికి శస్త్రచికిత్స చేయాల్సి ఉందని వైద్యులు తెలిపారు. రాజశేఖర్‌ను కార్మిక సంఘాల ప్రతినిధులు, రాజకీయ నాయకులు పరామర్శించారు.

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నేడు

బీచ్‌రోడ్డు: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను హరే కృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ హాల్‌లో బుధవారం, గురువారం నిర్వహించనున్నట్లు యదురాజ దాస ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రెండు రోజుల్లో దర్శనం, హరి నామ జప మండపం, మహా అభిషేకం, బాల గోపాలునికి ఉయ్యాల సేవ, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 వరకు కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. భక్తులు పాల్గొని శ్రీకృష్ణ భగవానుని దర్శనం చేసుకోవాలని కోరారు.

అతి వేగం.. తీరని విషాదం

- ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన ప్రైవేటు బస్సు
- ఒకరు మృతి, 14 మందికి గాయాలు

నక్కపల్లి: జాతీయరహదారిపై నక్కపల్లి సమీపంలో ఆగి ఉన్న లారీని ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా మరో 14 మంది తీవ్రగాయాల పాలయ్యారు. డ్రైవరు అతి వేగంగా బస్సును నడపడం వల్లే ఈ ప్రమాదం సంభవించిందని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం అర్ధరాత్రి ఈ ప్రమాదం జరిగింది. పార్వతీపురం నుంచి గుంటూరు వెళ్తున్న సాయికృష్ణ ప్రైవేటు ట్రావెల్ బస్సులో సుమారు 40 మంది ప్రయాణిస్తున్నారు. వీరంతా వేర్వేరు ప్రాంతాలకు వెళ్లేందుకు పార్వతీపురం, బొబ్బిలి, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లిలలో బస్సు ఎక్కారు. బస్సు అర్ధరాత్రి ఒంటి గంట ప్రాంతంలో నక్కపల్లి దాటిన తర్వాత కిలోమీటరు దూరంలో మనబానవానిపాలెం రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని ఢీకొట్టినట్లు ప్రయాణికులు తెలిపారు. అనకాపల్లిలో జరిగిన వివాహానికి హాజరై తిరిగి వెళ్తున్న విజయవాడ సమీపంలో గొల్లపూడి గ్రామానికి చెందిన బైపాన రమేష్ (35) బస్సులోనే చిక్కుకుని అక్కడికక్కడే మరణించారు. ఇదే ప్రమాదంలో ఆయన భార్య బైపాన కుమారి, కుమారుడు మోక్షిత్ (ఆరు నెలలు)తోపాటు 14మంది గాయపడ్డారు. బస్సు ముందు భాగంలో కూర్చున్న రమేష్ సీట్లో ఇరుక్కొని అక్కడిక్కడే ప్రాణాలు విడిచారు. క్షతగాత్రులను అంబులెన్స్‌లలో నక్కపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. స్వల్ప గాయాలైన వారిని ప్రాథమిక చికిత్స అనంతరం వారి ప్రాంతాలకు పంపించారు. ఆరు నెలల మోక్షిత్ తలకు బలమైన గాయాలయ్యాయి. అతని పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం విశాఖ తరలించారు. సంఘటన స్థలాన్ని నర్సీపట్నం ఏఎస్పీ ఆదిరాజ్‌సింగ్ రాణా, నక్కపల్లి సీఐ అప్పన్న పరిశీలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారి నుంచి వివరాలు సేకరించారు. మృతుడి భార్య కుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పోలీసులు తెలిపారు.

రూ.65.18 లక్షల ఆస్తిపన్ను చెల్లించిన ఏపీఐఐసీ

గాజువాక : 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను గాజువాక ఏపీఐఐసీ, ఐలా రూ.65,18,605 ఆస్తిపన్నును చెల్లించింది. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును జీవీఎంసీ గాజువాక రెవెన్యూ అధికారులు సీహెచ్.రామనారాయణ, ఎం.శ్రీకాంత్, ఆర్ఐలు మోహన్, సుభాన్, శివ ఏపీఐఐసీ అధికారులనుంచి వసూలుచేసి జోనల్ కమిషనర్ పి.సింహాచలంకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా అధికారులను ఆయన అభినందించారు.



ఆస్తిపన్ను చెక్కును జెడ్సీకి అందజేస్తున్న రెవెన్యూ అధికారులు